క్లుప్తంగా

చెట్లకొమ్మలు తొలగించారు



సాక్షి స్పందన

కమాన్‌పూర్: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి నుంచి కమాన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే దారి మూలమలుపు వద్ద చెట్లకొమ్మలతో ప్రమాదం పొంచి ఉందని 27న సాక్షి దినపత్రిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కమాన్‌పూర్ పంచాయతీ కార్యదర్శి రాజ్‌కుమార్ శుక్రవారం చెట్లకొమ్మలను తొలగించారు. సమస్య పరిష్కరించినందుకు వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.

రేపల్లెవాడలో కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న సీఐ ప్రసాదరావు

కమాన్‌పూర్: మండలంలోని నాగారం గ్రామపరిధిలోని రేపల్లెవాడలో శుక్రవారం ఉదయం కమాన్‌పూర్ ఎస్సై కొట్టే ప్రసాద్ ఆధ్వర్యంలో కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పోలీసులు ఇంటింటి సోదాలు నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గోదావరిఖని టూటౌన్ సీఐ నక్క ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ఏమైనా సమస్యలు వస్తే నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆన్‌లైన్ మోసాలపై ప్రజలు జాగ్రతగా ఉండాలన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



మాక్ పోలింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కమాన్‌పూర్: మండలంలోని పేంచికల్‌పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భారత రాజ్యాంగం, ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న కోరుకంటి చందర్

పాలకుర్తి: మండలంలోని కూరగాయల మార్కెట్ కమిటీ చైర్మన్, ఈసాలతక్కళ్లపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు బదావత్ రాజేశం శుక్రవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. దీక్షా దివస్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధికార ప్రతినిధి ముల్కల కొమురయ్య, మండల కోఆప్షన్ మాజీ సభ్యులు సర్వర్‌పాషా, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన

పెద్దపల్లిరూరల్: సమాజంలో రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు అనుసరించాల్సిన పద్ధతులపై యువత అవగాహన పెంచుకోవాలని ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంకు సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని గాయత్రీ కాలేజీకి చెందిన విద్యార్థులు అంజలి, పూజిత, రోహిత్ 45రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. విద్యాసంస్థల అధినేత అల్లెంకి శ్రీనివాస్, లీడ్‌బ్యాంకు మేనేజర్ వెంకటేశ్, శ్రీధర్, సంతోష్, ప్రిన్సిపాల్ రవీందర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

సుల్తానాబాద్: మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి ఆదేశించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నిర్వహిస్తున్న మిడ్ డే మీల్స్ పూర్తిగా నాణ్యతతోనే ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మిడ్ డే మీల్స్ నిర్వాహకులు పాల్గొన్నారు.

చలికి గజగజ



చలి విరుచుకుపడుతుండడంతో పల్లె, పట్టణం తేడా లేకుండా రాత్రిళ్లు స్థానికులకు చలి మంటలు తప్పట్లేదు. ఇక ఉదయం పొద్దంతా మంచుదుప్పటి కమ్మేస్తూ ఈదురుగాలులతో పొగమంచు ఆవరించి వణుకు పుట్టిస్తోంది. పది దాటినా భానుడు కానరాక పగలంతా మబ్బుల్లో దోబూచులాడుతూ వచ్చీ రానట్టు వచ్చిపోతున్నాడు. జిల్లావ్యాప్తంగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతూ రోజురోజుకూ పడిపోతున్నాయి. చిన్నా పెద్దా తేడా లేకుండా చలి మంటలు కాగుతున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



చలి మంట కాగుతున్న స్థానికులు



చలికి స్థానికుల తిప్పలు



ముత్తారం: మండల కేంద్రంలో రక్షణ కంచె లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం పొంచి ఉంది. నిత్యం పాఠశాల విద్యార్థులు, మండల ప్రజలు ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే నడిచి వెళ్లే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. తక్కువ ఎత్తులో ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అనే భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే కంచె ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సమస్యల పరిష్కారానికే ప్రజాపాలన



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజాపాలన కొనసాగుతోందని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అన్నారు. ఎమ్మెల్యే కార్యాలయానికి శుక్రవారం వచ్చిన 39డివిజన్ పరిధిలోని గౌతమినగర్, శాంతినగర్, ఎక్స్‌సర్వీస్‌మెన్, మాతంగికాలనీ ప్రజలతో ఆయన మాట్లాడారు. శాంతినగర్‌లో వర్షాలకు కాలనీ మునగకుండా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ చేయాలని, హనుమాన్‌నగర్‌లో రోడ్డు మరమ్మతు చేయాలని, ప్రగతినగర్, ఎక్స్‌సర్వీస్‌మెన్ కాలనీలో విద్యుత్ స్తంభాలు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. మూడురోజుల్లో పనులకు సంబంధించి శంకుస్థాపన చేస్తానని ఎమ్మెల్యే ప్రజలకు హామీ ఇచ్చారు. అభివృద్ధి కోసం ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు బెంద్రం రాజిరెడ్డి, అసిఫ్‌ఖాన్, డివిజన్‌కు చెందిన పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

విజయోత్సవ సభకు తరలిరావాలి

గోదావరిఖని: పెద్దజిల్లా కేంద్రంలో డిసెంబర్ 4న నిర్వహించే నిరుద్యోగ విజయోత్సవ సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకులు బొంతల రాజేశ్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



పాలకుర్తి: క్షీరాభిషేకం చేస్తున్న మనోహర్‌రెడ్డి

కమాన్‌పూర్: రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కమాన్‌పూర్ పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం బోనస్ పొందిన రైతులతో కలిసి రైతు పండుగ సంబరాలు నిర్వహించారు. డైరెక్టర్ అద్వాల చంద్రయ్య, సీఈవో తిమ్మరాజు సంతోష్‌కుమార్ ఉన్నారు.

పాలకుర్తి: కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రస్తుతం రైతులే పండించిన సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తూ ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని కన్నాల సింగిల్‌విండో చైర్మన్ బయ్యపు మనోహర్‌రెడ్డి అన్నారు. కన్నాల సింగిల్‌విండో పరిధిలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో బోనస్ డబ్బులు జమయ్యాయి. దీంతో శుక్రవారం బసంత్‌నగర్, కొత్తపల్లి, పాలకుర్తి, కన్నాల, రాణాపూర్ ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, రామగుండం, ధర్మపురి ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్, అడ్లూరి లక్ష్మణ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, మాజీ సర్పంచులు మల్లెత్తుల శ్రీనివాస్, పర్శవేని శ్రీనివాస్, నాయకులు తోట ప్రశాంత్, నార సత్తయ్య, దేవనందుల రాజమౌళి, సింగిల్‌విండో సీఈవో సదయ్య పాల్గొన్నారు.

ధర్మారం: మండలంలోని నందిమేడారం సహకార సంఘంలో శుక్రవారం రైతు పండుగ కార్యక్రమాన్ని చైర్మన్ బలరాంరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఎలిగేడు: మండలంలోని కొనుగోలు కేంద్రాల్లో సన్నవడ్లు విక్రయించిన రైతులకు బోనస్ పడినట్లు ఏవో ఉమాపతి తెలిపారు.

పెద్దపల్లిరూరల్: సన్నధాన్యం పండించిన రైతుల ఖాతాలో క్వింటాల్‌కు రూ.500 బోనస్ మొత్తాన్ని జమ చేసినట్లు మండల వ్యవసాయాధికారి అలివేణి తెలిపారు. కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

సంక్షిప్త వార్తలు

• ప్లకార్డుల ప్రదర్శన

ముత్తారం: 010 జీవో అమలు చేయాలని మండలంలోని మోడల్ స్కూల్‌లో శుక్రవారం భోజన విరామ సమయంలో టీచర్లు ప్లకార్డులతో ప్రదర్శన చేశారు. టీచర్లు శ్రీనివాస్, కృష్ణవేణి, శాంతి, చైతన్య, అశోక్, రాజగోపాల్, సునీత, నిర్మల పాల్గొన్నారు.

• కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోళ్లు

మంథని: వరిధాన్యం కేంద్రాల్లో ఎలాంటి కటింగ్ లేకుండా కొనుగోళ్లు చేస్తున్నామని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పోతారం, ఖాన్ సాయిపేట్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో సంఘ డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

• ఓదెల మల్లన్న సన్నిధిలో పూజలు

ఓదెల: మల్లికార్జునస్వామి దేవస్థానంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు, ధర్మశాస్త్రం పీఠాధిపతి శివానందస్వామి శుక్రవారం పూజలు చేశారు.

• స్ట్రక్చరల్ సమావేశంలో కార్మికులకు నిరాశ

గోదావరిఖని: ఐదేళ్ల తర్వాత జరిగిన స్ట్రక్చరల్ సమావేశంలో కార్మికులకు నిరాశే మిగిలిందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి విమర్శించారు. ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న కార్మికుల సమస్యలు పెద్దగా పరిష్కారం కాలేదన్నారు. సమావేశంలో 12 డిమాండ్లపై చర్చలు జరిపిందని కనీసం వాటిపై ఎలాంటి పురోగతి లేకుండా చర్చలు వాయిదా పడ్డాయన్నారు. వచ్చే నెలలో జరిగే చర్చల్లో ప్రధానమైన డిమాండ్లను నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు.

• బోధనేతర పనుల నుంచి మినహాయించాలి

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుంచి ముఖ్యంగా మధ్యాహ్నభోజన విధుల నుంచి మినహాయించాలని ఎస్టీయూ అధ్యక్షుడు మేరుగు సతీశ్, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్‌రెడ్డి కోరారు.

• సంఘం సభ్యులకు రుణమాఫీ

సుల్తానాబాద్‌రూరల్: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యులకు వందశాతం రుణమాఫీ కాగా తిరిగి రుణాలు చెల్లించినట్లు సంఘాల చైర్మన్‌లు మోహన్‌రావు, సందీప్‌రావు, మహిపాల్‌రెడ్డి, కోట వీణ అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని చిన్నకల్వల, గర్రెపల్లి, సుద్దాల, కనుకుల ప్రాథమిక సహకార సంఘాల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం రైతు పండుగ వేడుకలు నిర్వహించారు.

• రైతు పండుగ పోస్టర్ ఆవిష్కరణ

ఓదెల: మహబూబ్‌నగర్‌లో 30న జరిగే సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగే రైతు పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పొత్కపల్లి సొసైటీ చైర్మన్ ఆళ్ల సుమన్‌రెడ్డి కోరారు. మండలంలోని పొత్కపల్లి సొసైటీలో శుక్రవారం రైతు పండుగ పోస్టర్ ఆయన ఆవిష్కరించారు. మండలం నుంచి రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు.

• గోదావరిఖని ట్రాఫిక్ సీఐగా పురుషోత్తం

గోదావరిఖని: గోదావరిఖని ట్రాఫిక్ సీఐగా పురుషోత్తం శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

• ఎన్టీపీసీ ఎస్సైగా ఉదయ్‌కిరణ్

జ్యోతినగర్: ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా టి.ఉదయ్‌కిరణ్ బాధ్యతలు స్వీకరించారు.

• ఉసిరి చెట్టు వద్ద పూజలు

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మహిళలు ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించి దాత్రి నారాయణ పూజలు, లలిత పారాయణం చేశారు.

• పూనెం రమేశ్‌ను కోర్టుకు హాజరుపర్చాలి

గోదావరిఖని: పోలీసులు అరెస్ట్ చేసిన అజ్ఞాత దళ కమాండర్ పూనెం రమేశ్‌ను వెంటనే కోర్టులో హాజరు పర్చాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం స్థానిక పైలాన్ చౌరస్తాలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమక్రసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.కృష్ణ, నాయకులు ఎ.వెంకన్న, నరేశ్, అశోక్, మల్లేశ్, చంద్రయ్య, దుర్గయ్య, రమేశ్ పాల్గొన్నారు.

• రహదారి పునరుద్ధరణపై ప్రజల హర్షం

రామగుండం: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయం, ఐటీఐతో పాటు మూడు మండలాలకు కనెక్టివిటీ ఉన్న రహదారికి మట్టితో చేపడుతున్న పునరుద్ధరణ పనులపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు, మూడు మండలాలకు చెందిన ప్రజలు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

• సింహగర్జన సభ విజయవంతం చేయండి

మంథని: సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో డిసెంబర్ 1న నిర్వహించే మాలల సింహగర్జన మహా సభను విజయవంతం చేయాలని నాయకులు కొప్పూరి రాజలింగు, బండారి సమ్మయ్య కోరారు. మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు.

సుల్తానాబాద్: మాలల సింహగర్జన సభ జయప్రదం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఉమ్మడి జిల్లా కోచైర్మన్ నల్లల కనకరాజు కోరారు. మండల కేంద్రంలోని రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో శుక్రవారం కరపత్రాలను ఆవిష్కరించారు.

ఓల్డ్ అశోక్ టాకీస్ స్థలం ప్రభుత్వానికి అప్పగింత



స్థలాన్ని స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి ఆధీనంలో ఉన్న ఓల్డ్‌అశోక్ టాకీస్ స్థలాన్ని శుక్రవారం తిరిగి ప్రభుత్వానికి అప్పగించారు. 1959లో సింగరేణి సంస్థ చార్జ్ సర్టిఫికెట్ ద్వారా ప్రభుత్వం ఈభూమిని తీసుకుంది. ఈప్రాంత ప్రజల వినోదం కోసం 1965లో సినిమా టాకీస్ నిర్మాణం కోసం 34గుంటల స్థలాన్ని ఐదేళ్ల ప్రతిపాదికన కేటాయించారు. 1970లో లీజు గడువు పూర్తికాగా ఇప్పటివరకు అలాగే కొనసాగుతోంది. కొన్ని నెలల క్రితం ఓల్డ్ అశోక్ టాకీస్ కట్టడాన్ని నేలమట్టం చేశారు. ఈక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపల్ అవసరాలకు ఈస్థలాన్ని తిరిగి ప్రభుత్వానికి అప్పగించే ప్రక్రియ పూర్తి చేసింది. సుమారు 65 ఏళ్ల తర్వాత ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది.

కార్తీక దీపోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న శ్రీనుబాబు

మంథని: మంథనిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయ సమీపంలో కార్తీక మాసం సందర్భంగా సాయిచరణ్ (టింకు) దంపతులు శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. వేద బ్రాహ్మణులు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు దీపాలు వెలిగించారు. మంత్రి శ్రీధర్‌బాబు సోదరుడు శ్రీనుబాబు పూజల్లో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి భగవద్గీత పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కృష్ణప్రియ

సుల్తానాబాద్: జిల్లాస్థాయి శ్రీమద్ భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలకు సుల్తానాబాద్‌లోని ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల గీతా జయంతి సందర్భంగా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో జరిగిన శ్రీమద్ భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో పాఠశాలకు చెందిన స్మితిక శ్రీ, సంజనశ్రీ, టి.సాయిచరణ్, శ్రీనిత్య, అక్షయ, సాహిత్య మండల స్థాయిలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ అభినందించారు. పాఠశాల తెలుగు టీచర్ విజయలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

రాగినేడు ఆలయంలో కార్తీక సందడి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం రాగినేడులో స్వయంభూగా వెలిసిన నాగలింగేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం గోదావరిఖని ఆర్యవైశ్య, మహిళా సంఘ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఉసిరి చెట్టుకు పూజలు చేశారు. సంఘం అధ్యక్షుడు నటరాజశేఖర్, కిశోర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

గోదావరిఖని: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో శుక్రవారం జీడీకే–5 ఓసీపీ ప్రధాన గేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జీ–1 ఉపాధ్యక్షుడు సదానందం మాట్లాడుతూ ప్రాజెక్టు నూతన యంత్రాలను కొనుగోలు చేసి ఉత్పత్తి చేపట్టాలన్నారు. ఓవర్‌మెన్లకు చార్జ్ అలవెన్స్ చెల్లించాలని, డ్రిల్లింగ్, బ్లాసింగ్ పనులు కంపెనీ ఉద్యోగులతో నిర్వహించాలని కోరారు. కార్మికులపై యాజమాన్యం వేధింపు చర్యలు మానుకోవాలన్నారు. అనంతరం ప్రాజెక్టు మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు కృష్ణ, దామోదర్, పోచయ్య, రాజేందర్, విజయ్‌మోహన్, సమ్మయ్య, రమేశ్, రమేశ్, శ్రీనివాస్, సమ్మయ్య, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

ఆర్జీ–1లో సింగరేణి క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–1 పరిధిలోని క్వార్టర్లకు కౌన్సెలింగ్ శుక్రవారం నిర్వహించారు. స్థానిక ఆర్‌సీవోఏ క్లబ్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఏరియాలోని పలు గనులు, డిపార్ట్‌మెంట్‌లలో పనిచేస్తున్న ఉద్యోగులకు కౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్లు కేటాయించారు. స్థానిక శారదానగర్, విఠల్‌నగర్, తిలక్‌నగర్, బస్టాండ్‌కాలనీలోని డీ, టీ–2, ఎంబీ, ఎస్టీ–2 టైప్ క్వార్టర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 352 క్వార్టర్లకు గాను 70మంది దరఖాస్తు చేసుకోగా అర్హత, కేటగిరీని బట్టి క్వార్టర్లు కేటాయించారు. ఎస్‌వోటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం పర్సనల్ కిరణ్‌బాబు, బ్రాంచ్ సెక్రటరీ ఆరెల్లి పోశం, సీనియర్ పీవో శ్రావణ్, హనుమంతరావు, సంక్షేమాధికారులు ఇక్బాల్ షరీఫ్, రవీందర్, ఫిరోజ్ ఖాన్, క్వార్టర్ సెక్షన్ సిబ్బంది శ్రీనివాస్, అన్వేష్ పాల్గొన్నారు.

ఓసీపీ–1 సందర్శన



ప్రాజెక్టు క్వారీని పరిశీలిస్తున్న బృందం

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–3 పరిధిలోని ఓసీపీ–1 ప్రాజెక్టును ఐటీసీఎల్ అధికారుల బృందం శుక్రవారం సందర్శించింది. ముందుగా క్వారీ వ్యూ పాయింట్ వద్దకు వెళ్లి బ్లాస్టింగ్ తీరును పరిశీలించారు. వాతావరణ సమతుల్యతకు తీసుకుంటున్న చర్యలను ప్రాజెక్టు అధికారి రాజశేఖర్ వివరించారు. ఎన్విరాన్మెంట్ క్లియరెన్స్ స్థితిగతులు, నూతన పనులను పరిశీలించారు. ప్లాంటేషన్ తీరు పరిశీలించి సానుకూలంగా స్పందించారు. ఐటీసీఎల్ ఈడీ బి.అనిల్‌కుమార్, సీజీఎం కమల్‌శీల్, సంజీవ్‌తివారీ, ప్రాజెక్టు మేనేజర్ ఉదయ్‌హరిజన్, ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

కార్మికుల సొంతింటి కలపై పోరాటం



మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

గోదావరిఖని: కార్మికుల సొంతింటి కలపై ఐఎన్‌టీయూసీ పోరాటం చేస్తోందని ఆర్జీ–3 ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి అన్నారు. ఓసీపీ–1 సీహెచ్‌పీలో శుక్రవారం జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సొంతింటి కల, పెర్క్స్‌పై ఇన్‌కంటాక్స్ మాఫీ, రెండేళ్ల మెడికల్ సర్వీస్ నిబంధన తొలగించాలని, పెండింగ్‌లో ఉన్న విజిలెన్స్ కేసులు పరిష్కరించాలని రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కలిసినట్లు పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధనలో తమ యూనియన్ రాజీలేకుండా ముందుకు సాగుతోందన్నారు. పెండింగ్‌లో ఉన్న పలు సమస్యల పరిష్కారం కోసం స్ట్రక్చరల్ సమావేశంలో చర్చించినట్లు పేర్కొన్నారు. నాయకులు గడ్డం తిరుపతి, నారెడ్ల శ్రీనివాసరావు, జక్కుల దామోదర్, ఆకుల మల్లయ్య, రామకృష్ణ, లక్ష్మీపతిగౌడ్ పాల్గొన్నారు.

శివాజీ ఆశయాలను కొనసాగించాలి



శివాజీ విగ్రహం ఆవిష్కరిస్తున్న శివానంద స్వామి

ఓదెల: శివాజీ ఆశయాలను యువత, హిందువులు కొనసాగించాలని, గ్రామం నుంచి పట్టణాల వరకు విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు, ధర్మశాస్త్రం పీఠాధిపతి శివానందస్వామి కోరారు. మండలంలోని కనగర్తిలో ఇట్యాల బాబురావు నిర్మించిన ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని శుక్రవారం వారు ఆవిష్కరించారు. బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు గొట్టెముక్కుల సురేశ్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గంట రాములుయాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు కారెంగల శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శిలారపు పర్వతాలుయాదవ్, జిల్లా ఇన్‌చార్జి ఆరుముల్ల పోశం, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, బీజేపీ ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు మీస అర్జున్‌రావు, మాజీ సర్పంచులు పులుగు తిరుపతిరెడ్డి, లక్ష్మన్, కోట దామోదర్‌రెడ్డి, నాయకులు సతీశ్, రాజేందర్ పాల్గొన్నారు.

ఢీ షో విన్నర్ జాను లిరికి సన్మానం



జానుతో అభిమానులు

గోదావరిఖనిటౌన్: ఈటీవీ–2 ఢీ షోలో సెలబ్రిటీ స్పెషల్ ట్రోఫీ విన్నర్ టైటిల్ గెలుచుకున్న యైటింక్లయిన్‌కాలనీకి చెందిన సింగరేణి బిడ్డ జాను లిరి శుక్రవారం గోదావరిఖనికి వచ్చారు. సినీ అభిమాన సంఘాల ఐక్యవేదిక నాయకుడు నెలకంటి రాము ఆధ్వర్యంలో ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సన్మానించారు.

కాలనీవాసుల స్వాగతం

యైటింక్లయిన్‌కాలనీ: యైటింక్లయిన్‌కాలనీలో పుట్టి పెరిగిన జాను లిరి శుక్రవారం సొంత ఊరికి రావడంతో అభిమానులు స్వాగతం పలికారు. గతంలో స్థానిక డ్యాన్స్‌మాస్టర్ శ్రీధర్ వద్ద శిక్షణ తీసుకున్న జాను లిరి ఢీ ప్రోగ్రాంలో ప్రతిభ చాటింది.